ప్రజాశక్తి
ఆదివారం 21 డిసెంబర్ 2025 5
విజయనగరం




23, 24న 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ శ్రీ లంక దినకర్ ఈనెల 23, 24తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. మంగళవారం రాత్రి 8గంటలకు విజయనగరం చేరుకొని, ప్రభుత్వ అతిథి గృహంలో బస చేస్తారు. బుధవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 వరకు కలెక్టరేట్‌లో జిల్లాలో అమలు జరుగుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రోజెక్టుల అమలు తీరుపై సంబంధిత అధికారులతో జరిగే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. ముఖ్యంగా కేంద్ర పథకాలైన ఆరోగ్యం, విద్యకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలు అమలు, ప్రగతిపై, అమృత్ పథకం అమలు స్థితి, జల జీవన్ మిషన్ పథకం ప్రగతి తదితర పథకాలపై సమీక్షా చేస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు పాత్రికేయుల సమావేశంలో పాల్గొంటారు. 3 గంటలకు ఎన్.డి.ఎ. స్థానిక నాయకులతో సమావేశం అవుతారు.

ఆశ.. నిరాశ

- జిల్లాకు 200 చొప్పున కొత్త పింఛన్లు?
- వికలాంగులకు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు ప్రాధాన్యత
- మరోవైపు రీవెరిఫికేషన్ పేరిట పింఛనుదార్లకు నోటీసులు



కొత్త పింఛన్లు ఎప్పటికీ వస్తాయో..! అని కొందరు, ఉన్న పింఛన్లు ఉంటాయో..? ఊడిపోతాయో..? అంటూ ఇంకొందరు ఆశ నిరాశతో ఉన్నారు. తాజాగా జిల్లాకు 200 చొప్పున పింఛన్లు మంజూరు చేసే అవకాశం ఉండడంతో మన వరకు వస్తాయా, రావో అంటూ ఎదురు చూస్తున్నారు. అయితే కొత్త పింఛన్లు మంజూరులో కేవలం దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు, వికలాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తుండడంతో ఇతర కేటగిరీలకు చెందిన వారు నిరాశ చెందుతున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో సుమారు 15 కేటగిరీల్లో 2,73,083 మందికి ప్రభుత్వ పింఛన్లు అందుతున్నాయి. వీరిలో అత్యధికంగా కిడ్నీ తదితర దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు చొప్పున, వివిధ ప్రతిభావంతులకు రూ.6 వేలు, సైనిక వెల్ఫేర్ కేటగిరీలో రూ.5 వేలు, అభయ హస్తం కేటగిరీలో రూ.500 చొప్పున, మిగిలిన కేటగిరీ పింఛన్లకు రూ.4 వేలు చొప్పున అందుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లాలోని పింఛనుదారు లందరికీ కలిపి నెలకు రూ.115.08 కోట్ల మేర అందుతోంది. ఇందుకు తగ్గట్టే అర్హత పొందిన ప్రతిఒక్కరూ పింఛన్ల ద్వారా కుటుంబాన్నీ నెట్టుకురావచ్చని ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ, కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నప్పటికీ కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హులంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక సంఖ్యలో వికలాంగుల పింఛన్ల తొలగింపునకు ఆరు మాసాల క్రితం నోటీసులు జారీచేసిన సంగతి తెలిసిందే. దీంతో, వికలాంగులు అధిక సంఖ్యలో రోడ్డెక్కడంతో తాత్కాలికంగా ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కానీ, ప్రస్తుతం రీవెరిఫికేషన్ పేరిట ఇటీవల నోటీసులు జారీచేసి, స్టాప్లు ఇచ్చారు. దీంతో, వికలాంగుల్లో మళ్లీ గుబులు మొదలైంది. అప్పుడు ఎందుకు ఆగినట్టు, ఇప్పుడు మళ్లీ ఎందుకు నోటీసులు జారీచేసినట్టు అంటూ వికలాంగులు, వారి కుటుంబాల్లో చర్చ నడుస్తోంది. మరోవైపు 60ఏళ్లు దాటినవారు, భర్తను కోల్పోయిన వితంతువులు వేలాదిగా కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న సంగతి విదితమే. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లాకు 200 పింఛన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం అనుమతించినట్టు వార్తలు వినవస్తుండడంతో ఆశ, నిరాశ మధ్య కొట్టుమిట్టాడుతున్నారు.

రెండొందలూ అరకొరే...

జిల్లాలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు వందల మంది ఉన్నారు. కిడ్నీ, క్యాన్సర్, పక్షవాతం, గుండె జబ్బులతో బాధపడుతున్న వారు రోజురోజుకూ పెరుగుతున్నారు. కొందరు వికలాంగులు సైతం పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. కానీ ప్రభుత్వం జిల్లాకు కేవలం 200 మాత్రమే మంజూరు చేయనున్నట్లు వార్తలు రావడంతో రోగుల్లో సైతం తమకు పింఛను మంజూరు అవుతుందో లేదోనని ఆందోళన నెలకొంది.

గతంలో ప్రతి ఆరు నెలలకూ

గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ఆరు నెలలకోసారి (జనవరి - జూన్ నెలల్లో) పింఛన్లు మంజూరయ్యేవి. టిడిపి - జనసేన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరినప్పటికీ పింఛన్ల మంజూరుకు ముందుకు రాలేదు. దీంతో పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నవారిలో ఆందోళన మొదలైంది. మరికొందరిలో ప్రభుత్వం తీరుపైనా ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకుంటున్నాయి. పింఛన్ల దరఖాస్తులకు వెబ్‌సైట్ కూడా తెరుచుకోవడం లేదని, నాట్ ఓపెన్ అని వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పింఛన్లు ఎప్పటికి మంజూరు చేస్తారో తెలియని పరిస్థితి ఉండడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా వ్యాప్తంగా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, విభిన్న ప్రతిభావంతులు, డప్పు కళాకారులు, చేనేత, కల్లుగీత కార్మికులతోపాటు వివిధ కేటగిరీల్లో పింఛనుకు అర్హులైన వేలాది మంది పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని

గాంధీజీ పేరుతోనే కొనసాగించాలి

మతోన్మాద చర్యలకు బిజెపి పాల్పడుతోంది : వ్యకాస, కెవిపిఎస్ ,రైతు, కౌలు రైతు సంఘాలు



కలెక్టరేట్‌లో గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు జి. శ్రీనివాస్, కుల వ్యవస్థ వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. శనివారం ఉపాధి హామీ చట్టంలో మార్పులకు వ్యతిరేకంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహం వద్ద ప్రజా సంఘాలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలో మార్పులు చేస్తూ తీసుకువచ్చిన బిల్లును తప్పు పట్టారు. తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని లేనియెడల ప్రజా ఉద్యమాలను సవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. 2014లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండి ఉపాధి హామీ చట్టంపై దాడి చేస్తుందని అన్నారు. ఇప్పటికే సాంకేతిక లోపాలను చూపిస్తూ కూలీల సంఖ్యను తగ్గించిందన్నారు. ఈ చట్టం అమలకు కేటాయించాల్సిన 100 నిధులను కోత పెట్టిందని, 60 శాతం నిధులు కేటాయిస్తూ 40 శాతం రాష్ట్రాల మీదకు నెట్టివేసిందని అన్నారు. అయినా రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం నోరు మెదపకుండా ఉండడం సిగ్గుచేటని. ఇప్పటికైనా ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు ముందుకు రావాలని అన్నారు. గ్రామీణ ప్రజలు ఉపాధి పొందేందుకు హక్కుగా గాంధీజీ పేరు తో ఉన్న చట్టాన్ని ఆయన పేరును తొలగించి పథకంగా మార్చే చర్యలకు పాల్పడడం యావత్ భారతదేశానికే అవమానకరమని అన్నారు. కార్పొరేట్ శక్తులు, భూస్వాములు అవసరాల కోసం బిజెపి ఇంతటి పన్నాగం పన్నిందని విమర్శించారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఉపాధి అవకాశాలకు దూరమై వలసలు మరింత ఎక్కువ అవుతాయని తెలిపారు. కావున కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకొని ఉపాధి హామీ చట్టాన్ని ఉన్నఫలంగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.రాము, సిఐటియు పట్టణ కార్యదర్శి బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి చట్టాన్ని కొనసాగించాలి

ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని బీసీ, ఎస్సీ,ఎస్టీ మైనారిటీల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేవారు. శనివారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐక్యవేదిక నాయకులు చోడి ఆదినారాయణ, రొంగలి రామారావు, కరీం, పి.షణ్ముఖరావు మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని తొలగించి, దాని స్థానంలో జిరామ్ జి కొత్త చట్టం తీసుకొచ్చి ప్రజలు కొంపముంచారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో దిమిలి పైడిరాజు, టివి దుర్గారావు, చిలికి లక్షణరావు, కిల్లంపల్లి ఆచారి, గండ్రెడ్డి శ్రీను, పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత నైతిక బాధ్యత

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ • ప్రభుత్వ ఐటిఐలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర

ప్రజాశక్తి-విజయనగరంకోట

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతీఒక్కరి నైతిక బాధ్యతని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఆవరణలో మొక్కలను నాటారు. ఐటిఐలోని ల్యాబ్‌లు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులు నిరుపయోగ వస్తువులతో రూపొందించిన కళాకృతులను తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ మంచి గాలి, చక్కని ఆహారం మనకు అందాలంటే పర్యావరణ పరిరక్షణతోపాటు, పరిసరాల పరిశుభ్రత కూడా ముఖ్యమని స్పష్టం చేశారు. ప్లాస్టిక్, ఇతర రసాయన పదార్థాల కారణంగా పరిసరాలు విషపూరితంగా మారుతున్నాయని చెప్పారు. కలెక్టర్ రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛత ప్రతీఒక్కరి జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి, జిల్లా నైపుణ్యాధికారి ప్రశాంత్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి శ్రీనివాస్, కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

పర్యావరణరహిత ఉత్పత్తులతో మెరుగైన ఆదాయం

విజయనగరం టౌన్ : పర్యావరణహిత ఉత్పత్తుల తయారీ, నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకుని వ్యాపారవేత్తలుగా రూపాంతరం చెందాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక ఆనందగజపతిఆడిటోరియంలో వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ పల్లి నల్లనయ్య ముందుగా తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆ తర్వాత అక్కడ ఏర్పాటు చేసిన వివిధ రకాల ప్రదర్శన శాలలను సందర్శించారు. సౌర పునరుత్పాదక శక్తి, సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యర్థాల నుండి ఎరువులు తయారీ వివరాలను పరిశీలించారు. అనంతరం సభా వేదిక వద్దకు చేరుకుని పారిశుధ్య నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన పారిశుధ్య కార్మికులను సత్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకంగా ఆలోచించండి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విద్యార్థులు సృనాత్మకంగా ఆలోచించి వినూత్న ఆవిష్కరణలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ, డ్రాయింగ్ పోటీల విజేతలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం బహుమతి ప్రదానం జరిగింది. విజేతలకు ప్రశంసా పత్రం, జ్ఞాపికలను ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంధనాన్ని పొదుపు చేసేందుకు కొత్త ఆవిష్కరణలు చేయాలని కోరారు. ఇంధన వనరుల లభ్యత పరిమితమని, భవిష్యత్తు తరాల కోసం ఇంధనాన్ని పొదుపు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సూర్యరశ్మి లాంటి సంప్రదాయేతర ఇంధన వినియోగాన్ని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో డిఇఒ యు.మాణిక్యం నాయుడు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, ఇఇలు, డిఇలు, ఇతర అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి

శిక్షణకు వెళ్తున్న కానిస్టేబుళ్లకు ఎస్‌పి దిశానిర్దేశం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా కానిస్టేబుల్ అభ్యర్థులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్పి ఎఆర్ దామోదర్ సూచించారు. కానిస్టేబుళ్లుగా నియమితులైన వారు 9 నెలల ప్రాథమిక శిక్షణ నిమిత్తం వెళ్లే సమయంలో ఎఆర్ దామోదర్ వారితో మమేకమై, శిక్షణలో అనుసరించాల్సిన తీరు, క్రమశిక్షణ పట్ల జిల్లా పోలీసు కార్యాలయం వద్ద శనివారం దిశా నిర్దేశం చేసారు. పోలీసుశాఖలో విధులు నిర్వహించడం సులువుగా లభించే అవకాశం కాదన్నారు. ఉద్యోగం సాధించేందుకు శారీరకంగా మంచి నైపుణ్యం, రాత పరీక్షలో ప్రతిభ కనబరిస్తేనే సాధ్యమైందన్న విషయాన్ని మరువరాదన్నారు. సమాజంలో తప్పు చేసిన వ్యక్తులను సంస్కరించాల్సిన బాధ్యత కూడా పోలీసులపైనే ఉంటుందన్నారు. పోలీసుశాఖలో మంచి ప్రతిభ కనబరిస్తే ఉన్నతంగా ఎదగవచ్చునన్నారు. మహిళా కానిస్టేబుళ్ళుగా జిల్లా నుండి ఎంపికైన 38 మంది ఒంగోలు పోలీసు శిక్షణ కేంద్రానికి, 78 మంది కానిస్టేబుళ్ళుగా ఎంపికైన పురుషులను చిత్తూరు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి వెళ్ళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిపిఒ ఎఒ పి.శ్రీనివాసరవు, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, సిసిఎస్ సిఐ ఎస్.కాంతారావు, రిజర్వు ఇన్స్పెక్టర్లు ఎన్.గోపాల నాయుడు, టి.శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐ నీలిమ పాల్గొన్నారు.



శిక్షణకు వెళ్తున్న కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న ఎస్‌పి

రుణ మంజూరు లక్ష్యాలను సాధించాలి

• ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు సహకరించాలి • బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంకోట



అవని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుకు బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను ఈ ఏడాది పూర్తయ్యేలోగా సాధించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. లబ్దిదారులకు రుణాలను ఇప్పించడంతోపాటు, ఆ రుణాన్ని బ్యాంకులు తిరిగి వసూలు చేయడంలో కూడా ప్రభుత్వ శాఖలు తమవంతు సహకారం అందించాలని సూచించారు. జిల్లా స్థాయి డిసిసి, డిఎల్ఆర్‌సి సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జరిగింది. పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకులకు ఇచ్చిన లక్ష్యాలన్నీ సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు. రికవరీలో కూడా భాగస్వాములు కావాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యతకు అనుగుణంగా, జిల్లాలో ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలకు పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేయాలన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి కూడా సహకరించాలన్నారు. విరివిగా పంట రుణాలను అందించాలని, అలాగే అర్హత ఉన్న కౌలురైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి రుణాలను ఇవ్వాలని కోరారు. మెప్మా ప్రచురించిన వార్షిక సంచిక అవని పుస్తకాన్ని ఈ సందర్భంగా కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసపాణి, మెప్మా పీడీ చిట్టిరాజు, జెడ్‌పి సిసిఒ బివి సత్యనారాయణ, ట్రాన్స్‌కో ఎస్ఇ లక్ష్మణరావు, ఉద్యానశాఖ డిడి చిట్టిబాబు, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి వెంకటేశ్వరావు, నాబార్డు డిడిఎం నాగార్జున, ఎల్‌డిఎం వివి రమణమూర్తి, ఇతర శాఖల అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

కంటోన్మెంట్ : జిల్లాలో దీర్ఘకాలంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేకంగా రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియలో తలెత్తుతున్న సాంకేతిక, క్షేత్రస్థాయి సమస్యలు, జాయింట్ ఎల్‌పిఎం, 22ఎ, దేవాదాయ శాఖ భూములు, అన్-సర్వేయిడ్ అండ్ అన్-సెటిల్డ్ గ్రామాలు, ఎస్టేట్, ఈనాం గ్రామాల సమస్యలు, ఈనాం భూములకు సంబంధించి ఉన్న న్యాయపరమైన, రెవెన్యూ చిక్కులు, వెబ్ ల్యాండ్, అడంగల్ రికార్డులు, వ్యవసాయ సాగు పట్టాలు, ఇళ్ల పట్టాలు, టైటిల్ డీడ్లు తదితర అంశాలపై చర్చించారు. క్షేత్రస్థాయిలో ప్రతి సమస్యను నిశితంగా పరిశీలించి, పరిష్కారానికి సమగ్ర నివేదికలను రూపొందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో వీటికి పరిష్కారాలను కనుగొనాలని, అవ్వని వాటిని రాష్ట్ర స్థాయికి పంపిస్తామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

సవరవెల్లి, తూడెం రోడ్డు పనులపై సమీక్ష

సవరవెల్లి, తూడెం మార్గం ద్వారా భోగాపురం రోడ్డు కనెక్టివిటీకి సంబంధించి ఎడిఎసిఎల్ ప్రతిపాదించిన రోడ్డుపై జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి శనివారం కలెక్టర్ ఛాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆ రహదారిలో మామూలు కల్వర్టు స్థానంలో బాక్స్ కల్వర్టు ఏర్పాటు చేయాలని, అందుకు అనుగుణంగా సవరించిన ప్రతిపాదనలు తక్షణమే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రహదారి పనులను ఐదారు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాసరావు, ఎడిఎసిఎల్ జిఎం ప్రవీణ్, ఆర్అండ్‌బి ఎస్ఇ కాంతిమతి, సంబంధిత కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కంటోన్మెంట్ : భవ్య యాజమాన్యం 104 ఎంఎంయు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా కూటమి ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని 104 ఎంఎంయు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.రామరాజు, డి.జగన్మోహన్ రావు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర 104ఉద్యోగుల సమస్యలను అధికారులకు తెలియ జేసినందుకు 104 రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సస్పెన్షన్ లెటర్ ఇచ్చారని, వెంటనే ఆ లెటర్‌ను రద్దుచేయాలని డిమాండ్‌చ ఏశారు. 104 ఉద్యోగులకు భవ్య యాజమాన్యం తగ్గించిన జీతాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రవికిషోర్ రాజు సి.హెచ్. అర్జున్, ఎం.శ్రీనివాసరావు, బంగారప్పడు, బి. కృపారావు తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎన్‌జిఒ పట్టణ తాలూకా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ఆనంద్‌కుమార్



రామకృష్ణ

ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం విజయనగరం పట్టణ తాలూకా యూనిట్ ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల అధికారిగా ఎస్‌వి సుధాకర్, సహాయ ఎన్నికల అధికారిగా జె.వి.ప్రసాదరావు వ్యవహరించారు. నూతన అధ్యక్షులుగా వై.ఆనంద్ కుమార్, కార్యదర్శిగా రామకృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంటుగా వై.రమణ, ఉపాధ్యక్షులుగా ఎస్. భీమేశ్వర రావు, బివిఎస్ ముత్యాల నాయుడు, కె.పవన్ కుమార్, కె.చంద్ర శేఖర్ ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా బి.ప్రసన్న కుమారి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.గోపాలకృష్ణ , జాయింటు సెక్రటరీలుగా కె.శ్రీనివాసరావు, పి. వెంకట రెడ్డి, ఎం.నవీన్ కుమార్, బి.శ్రీనివాస్, ఎం.సూర్యనారాయణ మూర్తి, జాయింటు సెక్రటరీ మహిళా డి.దుర్గ, కోశాధికారిగా ఎం.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. స్టేట్ కౌన్సిల్ మెంబరు గా కె.ఎస్.అప్పలనాయుడు , పివి రమణమూర్తి, ఎం.నాగరాజు, డిఇసి ఎన్నికల పరిశీలకులుగా జివిఆర్ఎస్ కిషోర్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా ఎపి ఎన్‌జిఒ అధ్యక్షులు టి.శ్రీధర్ బాబు, కార్యదర్శి ఎ.సురేష్, ఉపాధ్యక్షులు కెబి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

ఫోర్ట్ సిటీ పాఠశాలలో వైభవంగా లెర్నింగ్ ఫెస్ట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫోర్ట్ సిటీ పాఠశాలలో లెర్నింగ్ ఫెస్ట్ శనివారం వైభవంగా జరిగింది. సిబిఎస్ఇ, స్టేట్ సిలబస్ విద్యార్థులు కలిపి సుమారు 850 ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులందరూ ఈ లెర్నింగ్ ఫెస్ట్ లో పాల్గొని వైజ్ఞానిక సాంస్కృతిక, ఇతర విషయాలను విద్యార్థులు ప్రదర్శించారు. పాఠశాల చైర్మన్ కెపి శివ మాట్లాడుతూ ఇటువంటి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయని అన్నారు. కార్యకమంలో వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ డాక్టర్ యినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమా పాల్గొన్నారు.



స్టెతస్కోప్‌తో వైద్య పరీక్షలు చేస్తున్న విద్యార్థి

కూలీల 'ఉపాధి'పై బిజెపి దెబ్బ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎక్కడ కొట్టినా పర్లేదుగానీ పొట్టపై కొట్ట కూడదురా..! అంటుంటారు. ఉత్తరాంధ్రాలోనూ, ముఖ్యంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలోనూ సందర్భాన్ని బట్టి ఈ పదాలను ఉపయోగించడం పరిపాటిగానే వినిపిస్తుంది. దీనర్థం జీవనోపాధిపై దెబ్బకొడితే తిరిగి కోలుకోవడం కష్టమని అర్థం. ముఖ్యంగా మన జిల్లాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా తక్కువ. అందుకే పొట్టపై కొడితే మహాపాపం అని కూడా చాలా మంది చెబుతు ంటారు. కానీ, అంతటి మహా పాపానికి ఒడిగట్టింది బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఒడిగట్టిందంటూ జనం మండిపడుతున్నారు. ముఖ్యంగా ఉపాధి పనులపై ఆధారపడిన వారంతా గడిచిన నాలుగు రోజులుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం ఆధ్వర్యాన కూలీలు రోడ్లపైకి వచ్చి వివిధ రూపాల్లో ఆందోళన వ్యక్తం చేశారు.

2004లో అప్పటి యుపిఎ ప్రభుత్వం దేశంలో కమ్యూనిస్టుల భాగస్వామ్యంతో ఏర్పడిన సంగతి తెలిసిందే. వామపక్షాలతో కుదిరిన కనీస ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా ఆహార భద్రతా చట్టం, అటవీహక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం తదితరాలతో సహా 2005 - మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఏర్పడింది. నేడు ఊరూరా వందరోజుల పనిదినాలు ప్రభుత్వం కల్పిస్తోందంటే అది అప్పట్లో వామపక్షాలు చూపిన చొరవే. ఇందులో భాగంగా ఏడాదిలో వందరోజులు పని దినాలు కల్పించడమే కాదు రెండు వారాల్లోపే కూలి చెల్లించాలి. అడిగిన వెంటనే పని కల్పించలేకపోతే నష్టపరిహారం చెల్లించే బాధ్యత కూడా ప్రభుత్వానిదే. ఇంకా పని ప్రదేశాల్లో నీరు, నీడ, ఇతర భద్రతా చర్యలు, ఇన్యూరెన్స్ వంటి అనేక సదుపాయాలు సమకూర్చారు. ప్రభుత్వాలు మారినప్పడల్లా ఈచట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు



అవకాశం లేకుండా అప్పట్లో చట్టబద్ధం చేశారు. ఫలితంగా 2005 తరువాత అంతకు ముందుతో పోలిస్తే విజయనగరం, పార్వతీపురం జిల్లాల నుంచి వలసలు తగ్గాయి. కరోనా వంటి కరువు రోజుల్లో కూడా ఈ చట్టం ఇబ్బందులు లేకుండా గట్టెక్కిందనడంలో సందేహం లేదు. జిల్లాలో 6లక్షల 23వేల 471 జాబ్‌కార్డులు ఉన్నాయి. తద్వారా ఈ కుటుంబాలన్నీ కరువు వచ్చినా ఉపాధి పనుల రెక్కల కష్టంతో బతుకీడుస్తున్నాయి. 18ఏళ్లగా వందరోజులపని గ్యారెంటీగా కల్పించే మహాత్మగాంధీ జాతీయ ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు అనేక సరవరణలు చేసేసింది. మహాత్మ గాంధీ అన్న పేరు తొలగించడంతోపాటు 90శాతం నిధులను 60శాతానికి తగ్గిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టారు. ఈ ప్రభావం జిల్లాలోని ఉపాధి కూలీలతోపాటు రోడ్లు, కాలువలు, భవన నిర్మాణ పనులపైనా తీవ్ర ప్రభావం చూపుతుందడనడంలో సందేహం లేదు. మౌలిక సదుపాయాల కల్పనకు విఘాతం కలుగుతుంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడుతుందనడంలో సందేహం లేదు. అయినాగానీ, రాష్ట్రంలోని టిడిపి, జనసేన పార్టీలు నోరు మెదపడం లేదు. బిజెపి తానులో ముక్కలుగా వ్యవహరిస్తుండడం వల్ల బహుశా నోరు మెదపడం లేదేమో. కానీ, ఇది చారిత్రక తప్పిదం. ఉపాధి కార్మికులపొట్టపై బిజెపి కొట్టిన దెబ్బకు ఈ రెండు పార్టీలూ సహకరించినట్టే లెక్క అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు ఇప్పటికే ఉపాధి కార్డుదారులకు ఇకెవైసి చేయించాలనే మెలిక పెట్టడంతో వివిధ కారణాలతో అందుబాటులో లేని 1,09,006 మంది జాబ్ కార్డులను కొద్ది రోజుల క్రితమే హోల్డ్‌లో పెట్టేశారు. ఈ విధంగా విజయనగరం జిల్లాలో అత్యధికంగా సంతకవిటి మండలంలో 6,915కార్డులు తొలగించారు. ఇలా ఉపాధి కూలీలను పనికి దూరంచేయడం వంటి చర్యలు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని పలువురు విశ్లేషిస్తున్నారు. ఇటువంటి కుటిల చర్యలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థపైనా పడనున్నాయని పలువురు చెబుతున్నారు.

ఇంటి వద్దకే ఆర్‌టిసి కార్గో సేవలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎపిఎస్ఆర్‌టిసి డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవంలో భాగంగా శనివారం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా రవాణా అధికారి వరలక్ష్మి మాట్లాడుతూ ఎపిఎస్ఆర్‌టిసి డోర్ డెలివరీ విధానాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ధరలలో అందిస్తున్న కార్గో సేవలతో పాటు కార్గో డోర్ డెలివరీ మాసోత్సవం ఈనెల 20న మొదలై జనవరి 19 వరకు జరుగుతుందన్నారు. ఈనెల రోజులూ ప్రయాణికులు వారి బంధువులకు, మిత్రులకు, మిత్రులకు శ్రేయోభిలాషులకు వారికి నచ్చిన. పిండివంటలు, బహుమతులు ఎటువంటి డోర్ డెలివరీ వస్తువులనైనా సరే తక్కువ ధరలతోవారికి నచ్చిన పట్టణాలకి కేవలం 24 గంటల్లో 50 కేజీల వరకు, పది కిలోమీటర్ల దూరం వరకు డోర్ డెలివరీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాస రావు, అసిస్టెంట్ మేనేజర్ సుమిత్ర, స్టేషన్ మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఆర్‌టిసిలో రాష్ట్ర స్థాయిలో పార్శిళ్లు, కొరియర్లు డోర్ డెలివరీ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు డిపో మేనేజర్ కె.సుదర్శన రావు తెలిపారు. శనివారం ఎస్.కోట డిపోలో స్పెషల్ డ్రైవ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో విశాఖ, విజయనగరం, పలాస, బొబ్బిలి, శ్రీకాకుళం, మద్దిలపాలెం, అనకాపల్లితోపాటు నర్సీపట్నంలో కూడా ఈ డోర్ డెలివరీ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఆయా పట్టణాలలో 10 కిలోమీటర్ల పరిధి వరకు డోర్ డెలివరీ చేయనున్నట్లు చెప్పారు. 24 గంటల్లో పార్శిళ్ల డెలివరీ చేస్తామన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

ప్రజాదర్బార్‌కు 60 వినతులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

లక్కవరపుకోటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి 60 వినతులు అందాయి. వాటిలో కొన్నింటిని కోళ్ల లలితకుమారి తక్షణమే పరిష్కరించారు. మిగిలిన వినతులను ఆయా శాఖల అధికారులకు బదిలీ చేసి, సత్వర పరిష్కారానికి ఆదేశించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - బొబ్బిలి

పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండగలమని ఐసిడిఎస్ పిఒ జె.విజయలక్ష్మి అన్నారు. ఐసిడిఎస్ కార్యాలయం, గొల్లపల్లి, పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాలలో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

శ్రీనిధి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యుత్ పొదుపుపై ఎపిఇపిడిసిఎల్ నిర్వహించిన వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలలో పట్టణానికి చెందిన శ్రీనిధి పాఠశాల విద్యార్థి జి.ప్రదీప్ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ప్రథమ స్థానంలో నిలిచిన ప్రదీప్‌ను పాఠశాల కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు, వాసు విద్యాసంస్థల అధినేత రౌతు రామమూర్తి అభినందించారు.

గొరపల్లికి ఘన నివాళి

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలసలో శనివారం వైసిపి సీనియర్ నాయకులు గొరపల్లి రవి పెద్దకర్మ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు నివాళులర్పించారు. గొరపల్లి రవి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు, మాజీ ఎంపిపి గొరపల్లి శివ, బొంతల వెంకటరావు పాల్గొన్నారు.

చెత్త బండ్లు పంపిణీ

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండల కేంద్రంలోని గ్రీన్ అంబాసిడర్లకు మండల ఉపాధ్యక్షులు తలచుట్ల హరిబాబు, సర్పంచ్ ప్రతినిధి కెఎస్ఆర్‌కె ప్రసాద్ చేతుల మీదుగా 15వ ఆర్థిక సంఘ నిధులతో చెత్త బండ్లు పంపిణీ చేశారు. ఎట్టకేలకు పంచాయతీకి చెత్త బండ్లు రావడంతో పారిశుధ్య కార్మికులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ చందక శ్రీరాములునాయుడు, పంచాయతీ కార్యదర్శి అరుణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్వామిత్వపై శిక్షణ

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీలు సొంత ఆదాయం పెంచుకోవడం కోసం స్వామిత్వపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ సెక్రెటరీ, డిజిటల్ అసిస్టెంట్స్, విఆర్ఒ, సర్వేయర్లకు ఈ శిక్షణ ఇచ్చారు. టిఒటిలుగా దేశెట్టి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపిడిఒ, పంచాయతీ సెక్రెటరీ తాడ్డి వెంకటరావు, పినతాడివాడ, అమకం విలేజ్ సర్వేయర్ ఇమంది గిరిజ వ్యవహరించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, ఎంపిడిఒ వై.భవాని తదితరులు పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణం పరిశీలన

ప్రజాశక్తి - చీపురుపల్లి

పట్టణంలోని లావేరు రోడ్డులో నిర్మాణంలో ఉన్న మెజిస్ట్రేట్ కోర్టు నిర్మాణపు పనులను శనివారం జిల్లా జడ్జి భవిత పరిశీలించారు. ఆమెతో పాటు ఈ పనులను మాజీ ఎమ్‌పి, చీపురుపల్లి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బెల్లాన చంద్రశేఖర్, న్యాయవాది నాగభూషణరావు, ఎస్ఐ ఎల్.దామోదర్ రావు, పట్టణ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిసి సెల్ అధ్యక్షులుగా బెల్లాన

ప్రజాశక్తి - చీపురుపల్లి

వైసిపి జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షునిగా మండలంలోని రామలింగాపురం గ్రామానికి చెందిన బెల్లాన త్రినాధరావు నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి కార్యాలయం నుండి శనివారం నియామక ఉత్తర్వులు త్రినాధరావుకు చేరాయి. గతంలో నియోజకవర్గం అధ్యక్షునిగా త్రినాధరావు సేవలు అందించారు. తాజాగా బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా నియామకం కావడం పట్ల వైసిపి నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని శ్రీనివాస కాలనీకి చెందిన ఆడారి వరలక్ష్మి ఇటీవల జరిగిన ప్రమాదంలో వెన్నెముకకు తీవ్ర గాయమైంది. ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే డిసిఎంఎస్ చైర్మన్ గొంప క్రిష్ణ స్పందించి, విశాఖపట్నం ఎమ్‌పి ఎం.శ్రీభరత్ సహకారంతో శనివారం సిఎం సహాయనిధి నుంచి రూ.67 వేలు చెక్కును ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడలో శనివారం ఎస్ఐ కె.సీతారాం ఆధ్వర్యాన పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టారు. వాహనాలను తనిఖీ చేసి, వాటిపై ఉన్న పాత చలానాలను వసూలు చేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక అభ్యుదయ పాఠశాలలో శనివారం నిర్వహించిన ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని పాఠశాల కరస్పాండెంట్ మర్రాపు కూర్మినాయుడు, ప్రిన్సిపల్ చింతా శారద ప్రారంభించారు. శిబిరంలో 80మందికి పరీక్షలు చేయగా, 12 మందికి వ్యాధి లక్షణాలను గుర్తించారు. వీరికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. వైద్యులు సత్యదీప్, మనోజ్, అఖిల, అలేఖ్య స్క్రీనింగ్ పరీక్షలు చేశారు.

తెంటుకు శంబంగి పరామర్శ

ప్రజాశక్తి-బాడంగి

బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడును మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు పరామర్శించారు. లక్ష్మునాయుడు తల్లి సత్యవతమ్మ ఇటీవల మరణించడంతో శనివారం మండలంలోని ముగడ గ్రామంలో తెంటు నివాసానికి శంబంగి వెళ్లి, ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి, తెంటు లక్ష్మునాయుడును ఓదార్చారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

ప్రజాశక్తి - బొబ్బిలి

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం అవుతాయని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు అన్నారు. స్థానిక ఐరిస్ పాఠశాలలో శనివారం డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలతో కేన్సర్, ఇతర అనారోగ్య సమస్యలు వస్తాయని, డ్రగ్స్‌కు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


వ్యక్తిగత పరిశుభ్రతలోనూ ఆదర్శంగా ఉండాలి

క్రమశిక్షణే విజయానికి తొలి మెట్టు : ఎమ్మెల్యే కళా

ప్రజాశక్తి - చీపురుపల్లి

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం వల్లనే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. శనివారం స్థానిక బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అమలు చేస్తున్న ముస్తాబు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా, క్రమశిక్షణ, వ్యక్తిగత పరిశుభ్రతలోనూ ఆదర్శంగా ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ముస్తాబు' కార్యక్రమం ఒక అద్భుతమన్నారు. అనంతరం స్వయంగా ఎమ్మెల్యే విద్యార్థుల దగ్గరకు వెళ్లి, వారి గోళ్లు, జుట్టు, దుస్తుల శుభ్రతను పరిశీలించి, తగు సూచనలు చేశారు. నిత్యం స్నానం చేయడం, గోళ్లు కత్తిరించుకోవడం వంటి చిన్న చిన్న అలవాట్లే పెద్ద వ్యాధులను దూరం చేస్తాయని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిడిఒ హేమసుందర్, తహశీల్దార్ డి.ధర్మరాజు, ఎంపిడిఒ సురేష్, టిడిపి నాయకులు రౌతు కామనాయుడు, గవిడి నాగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగన రామారావు, త్రిమూర్తులరాజు, ముల్లు రమణ, జనసేన నాయకులు విసనగిరి శ్రీనివాసరావు, కోట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల ఆవరణలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ కెవి రమణ

పాఠశాలల్లో ముస్తాబు

తెర్లాం : మండలంలోని కూనాయవలస ప్రాథమికోన్నత పాఠశాలలో ముస్తాబు కార్యక్రమాన్ని శనివారం ఎంఇఒ జె.త్రినాథరావు ప్రారంభించారు. ఉదయం పాఠశాలలో ప్రార్థన అనంతరం తరగతుల వారీగా ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించినది, లేనిది పరిశీలించారు.

మెంటాడ : ఆంధ్ర ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జి.కృష్ణారావు ఆధ్వర్యాన ముస్తాబు కార్యక్రమం చేపట్టారు.

పెద తాడివాడ పాఠశాలలో 'ముస్తాబు'

డెంకాడ : మండలంలోని పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ముస్తాబు కార్యక్రమాన్ని జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.వి.రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశుభ్రత, స్వీయ క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. ముస్తాబు కిట్‌లో అద్దం, పౌడర్, నెయిల్ కట్టర్, దువ్వెన, సబ్బు, తువాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వివిఎ నర్సింగరావు, పాఠశాల సిబ్బంది, సిఆర్ఎంటి భాస్కరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టిపెట్టండి

మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-వేపాడ

పంచాయతీ సొంత ఆదాయ వనరుల పెంపుపై కార్యదర్శులు, విఆర్ఒలు, సర్వేయర్లు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు దృష్టిపెట్టాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వారికి శిక్షణ ఇచ్చారు. మార్కెట్ వేలం, కొబ్బరి, ఆదాయం వచ్చే చెట్లు నాటి వాటి ద్వారా కొంత ఆదాయం సమకూర్చుకోవచ్చని తెలిపారు. వాణిజ్య భవన సముదాయం నిర్మించి వాటి ద్వారా కొంత ఆదాయం పొందవచ్చన్నారు. ఇంటి పన్నులు వసూళ్ల ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ, డిప్యూటీ ఎంపిడిఒ జ్యోతి మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.



శిక్షణలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా పాఠ్యాంశాల వారీగా బోధన విధానం, విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయోనని పరిశీలించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. గ్రామంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు, తదితరులు పాల్గొన్నారు.



గేటు మీటింగ్‌లో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రామారావు

జ్యూట్ కార్మికులకు పిఎఫ్ వర్తింపజేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జ్యూట్ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ వర్తింపు చేయాలని జ్యూట్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన గేటు మీటింగులో మాట్లాడుతూ జ్యూట్ యాజమాన్యం అగ్ని ప్రమాదం జరిగిందని మిల్లును పాక్షికంగా తిప్పడం భావ్యం కాదన్నారు. మిల్లును సైరన్ వేయకుండా తిప్పడం వల్ల కార్మికులు హక్కులు, ఈ ఎస్ఐ, పిఎఫ్, బోనస్ వంటి సౌకర్యాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే కార్మికులు యాజమాన్యం వైఖరి తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రస్తుతం సైరన్ వేయకుండా మిల్లు తిప్పి హక్కులు హరిస్తున్నారని తెలిపారు. జ్యూట్ యాజమాన్యం కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్, బోనస్ వంటి సౌకర్యాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. అలకాని పక్షంలో కార్మికులు ఉద్యమం చేపట్టక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కె. అప్పారావు, హెచ్. అప్పారావు, ఎన్. రాము, బి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులు పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

గ్రామ పంచాయతీలు ఆదాయ వనరులు పెంచుకునేలా ప్రణాళి కలు రూపొందించాలని ఎంపిడిఒ రత్నం సూచించారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం స్వామిత్రపై పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, విఆర్ఒలు, సర్వేయర్లకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ ఎంపిడిఒలు నాగతులసి, వెంకటరమణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ రత్నం

కొత్తవలస : పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలని ఎంపిడిఒ ఎస్.రమణయ్య సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి శనివారం శిక్షణ ఇచ్చారు.

ఉన్మాదంలా మోడీ ప్రభుత్వ తీరు

ప్రజాశక్తి -బొబ్బిలి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పథకాల మార్పు ఉన్మాదాన్ని తలపించేలా ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్చడం అంటే మహాత్మా గాంధీని అవమానపరచడమేనని అభిప్రాయ పడ్డారు. ఇటీవల రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా, తాజాగా ఉపాధి హామీ పేరు మార్చాలని చూడటం దుర్మార్గమన్నారు. ఉపాధి హామీ పేరు మార్పుపై ఈ నెల 22న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోట అప్పన్న, తాడంగి ఎండు దొర పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - భోగాపురం

మండల కేంద్రంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజు పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను వేరు చేసి వినియోగయోగ్యంగా మార్చే ఈ కేంద్రం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి పిడుగు తోటరావు, ఎంపిటిసిలు పిడుగు వెంకట సత్యం, గనగళ్ళ బాబాజీ, సీనియర్ నాయకులు, అధికారులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సంపూర్ణ నిషేధానికి సహకరించాలి

నెల్లిమర్ల: ప్లాస్టిక్ నిషేధానికి అన్ని వర్గాలూ సహకరించాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, కమిషనర్ ఎస్. జనార్ధనరావు కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 'పరిసరాలు, నివాసాల ద్వారా ఉత్పన్నమయ్యే వ్యర్థాలను వనరులుగా ఉపయోగిస్తూ స్వయం ఉపాధి వాణిజ్య అవకాశాలు వంటి అంశాలపై సచివాలయ కార్యదర్శులు, మెప్మా సిబ్బంది వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ సముద్రపు రామారావు, మేనేజర్ టి.జయరాం, వార్డు సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, అవనాపు సత్యనారాయణ, నాయకులు లెంక అప్పలనాయుడు, కాళ్ళ రాజశేఖర్ అప్పికొండ రవి, మజ్జి ఆదినారాయణ, ముడిమంచి లక్ష్మణరావు, బైరెడ్డి కళ్యాణ్, నాగవంశం డైరెక్టర్ కాళ్ళ సత్యవతి, మెప్మా సిఎంఎం గేదెల రాము, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



గంట్యాడ : మొక్కను నాటుతున్న ఎంపిపి హైమావతి

మెరకముడిదాం: శ్యామాయవలసలో డిప్యూటీ ఎంపిడిఒ ఎస్‌విఆర్‌కె పట్నాయక్ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ, మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి శాంతమ్మ, ఆరోగ్య, అంగన్‌వాడీ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండల కేంద్రంలోని వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సూర్యనారాయణ, డిప్యూటీ ఎంపిడిఒ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నిర్మూలించాలి

గంట్యాడ : ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మొక్కలను పెంచి కాలుష్యాన్ని నిర్మూలించాలని ఎంపిపి పీరుబండి హైమావతి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రామవరం అంగన్వాడీ కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఐసిడిఎస్ పిఒ ఉమాభారతి, సర్పంచ్ పీరుబండి పద్మ, మహిళ సంరక్షణ కార్యదర్శి శైలజ, సూపర్వైజర్ అనురాధ, అంగన్వాడీ కార్యకర్తలు నాగవేణి, సత్యవతి పాల్గొన్నారు.

జెఎన్‌టియులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

విజయనగరం టౌన్ : జెఎన్‌టియుజివి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 'ఆపర్చునిటీస్ ఇన్ ఎన్విరాన్మెంట్' అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎపి పొల్యూషన్ బోర్డు విజయనగరం రీజనల్ ఆఫీసు నుంచి బి. చంద్రకళ పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ రాజేశ్వరరావు , వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి జె నాగరాజు, యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మణికుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఎ.శ్రీనివాసులు, డాక్టర్ బి.ధర్మారావు పాల్గొన్నారు.


మెరకముడిదాం : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, అంగన్వాడీ సిబ్బంది


సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్‌జడ్జి రోహిణిరావు

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి - బొబ్బిలి

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి హేమస్రవంతి జానకిరామ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణిరావు అన్నారు. స్థానిక కోర్టులో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే బాలికలు అనారోగ్యం బారిన పడతారన్నారు. గర్భం దాల్చిన సమయంలో తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని చెప్పారు. బాల్య వివాహాలు చేస్తే వధువు, వరుడు, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాల్య వివాహాలు నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు మూర్తి, సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేపై శిక్షణ

మెంటాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం స్వామిత్వ సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఈ నెల 31వ తేదికి సర్వే పూర్తిచేయాలని ఎంపిడిఒ సుదర్శనరావు స్పష్టంచేశారు. పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, ఇంజినీరింగ్ సర్వే, డిజిటల్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ విమలకుమారి, జిఎస్‌డబ్ల్యుఎస్ డిప్యూటీ ఎంపిడిఒ సోమేశ్వర్ పాల్గొన్నారు.

'గ్లోబల్‌వ్యూ' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-రామభద్రపురం

ఆర్‌బిఐ, కరూర్ వైశ్యా బ్యాంకు సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి ఒలింపియాడ్ పోటీల్లో గ్లోబల్ వ్యూ స్కూల్ విద్యార్థి గగన్ సాహు మూడో ర్యాంకు సాధించి ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ చంద్రమోహన్ తెలిపారు. ఆ విద్యార్థిని పాఠశాల చైర్మన్ పోల వెంకటరమణ, ప్రిన్సిపల్ సంధ్య, సిబ్బంది అభినందించారు.

విద్యార్థి బాధ్యత యాజమాన్యానిదే

ప్రజాశక్తి-శృంగవరపుకోట

త్రినేత్ర స్కూల్‌లో ప్రమాదంలో గాయపడిన విద్యార్థి వేమలి భార్గవ్ ఆరోగ్యం మెరుగుపడే వరకు పాఠశాల యాజమాన్యం బాధ్యత వహించాలని ఎంఇఒ నర్సింగరావు ఆదేశించారు. శనివారం పాఠశాలలో ప్రమాదం జరిగిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలకు అనుమతి లేకుండా డిఫెన్స్ పేరుతో ఏర్పాటు చేసిన స్కూల్ నేమ్ బోర్డును ఆయన తొలగించారు. స్కూల్ ఆనుకొని ఉన్న రాజుల చెరువు వైపు ప్రహరీ గోడను నిర్మించాలని, ఐదు రోజులలో మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు.


మత్స్యకార కుటుంబీకులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

మత్స్యకారులను క్షేమంగా తీసుకొస్తాం

ప్రజాశక్తి - భోగాపురం

బంగ్లాదేశ్ సముద్ర జలాల్లోకి పొరపాటున వెళ్లి బందీలుగా మారిన జిల్లా మత్స్యకారులను క్షేమంగా స్వదేశానికి తీసుకొచ్చే విషయంలో పూర్తి స్థాయిలో కృషి చేస్తామని ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. శనివారం పోలిపల్లి తన నివాసం వద్ద బందీలుగా ఉన్న 9 మంది మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించిన ఆయన, ప్రతి కుటుంబానికి రూ.5వేలు నగదు సహాయంతో పాటు ఒక బియ్యం ప్యాకెట్ అందజేశారు. మత్స్యకారుల విడుదల విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సూరాడ చిన్నారావు, టిడిపి నాయకులు గురుమూర్తి, బడే నాయుడు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ అరెస్టు

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని జయితి గ్రామంలో పింఛన్ల నగదు రూ.70,500ను డిజిటల్ అసిస్టెంట్ నక్కల శ్రీను సొంత ఖర్చులకు వినియోగించుకొని స్వాహా చేసినట్లు రుజువైంది. దీంతో ఆంధ్ర పోలీసులు శనివారం ఆయన్ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎంపిడిఒ సుదర్శన రావు ఫిర్యాదు మేరకు స్వాహా చేసిన పింఛను సొమ్ము డిజిటల్ అసిస్టెంట్ శ్రీను నుంచి రికవరీ చేసినట్లు ఎస్ఐ కె.సీతారాం తెలిపారు.

15వ రోజుకు దళిత మహిళల దీక్ష

ప్రజాశక్తి - భోగాపురం

ముంజేరు దళితులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం నాటికి 15వ రోజుకు చేరింది. ఇన్ని రోజులు నుంచి నిరసన తెలుపుతున్నా అధికారులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సమస్య పరిష్కరించకపోవడం ఆశ్చర్యకరమని బహుజన సమాజ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఎరుకొండ వెంకటరావు అన్నారు. దీక్షా శిబిరంలో ఉన్న దళిత మహిళలను శనివారం ఆయన పరామర్శించి సంఘీభావం తెలిపారు. దళిత మహిళలపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసినప్పటికీ ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయలేదని అన్నారు. తక్షణమే నిందితులను అరెస్టు చేసి బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు. ఆయనతో పాటు బహుజన పార్టీ నాయకులు దేబార్కి సూర్యం, మైలిపిల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - చీపురుపల్లి

వైసిపి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ సిఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఈనెల 21న ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీ తెలిపారు. శనివారంవారు విలేకర్లతో మాట్లాడుతూ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ల సారాధ్యంలో గరివిడి పార్టీ కార్యాలయం వద్ద పండగ వాతావరణం లో జన్మదిన వేడుకలను నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పేరిపి సర్పంచ్ కోరాడ పృధ్వి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ ఉత్పత్తిపై శిక్షణ

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలో శనివారం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సుధాకర్ పట్నాయక్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ ఉత్పత్తిపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డిజిటల్, సర్వే, ఇంజనీరింగ్ సహాయకులు, విఆర్ఒలకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రామ పంచాయతీలలో సొంత ఆదాయ ఉత్పతి ప్రక్రియ గురించి వివరించారు. శిక్షణ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా పి.రాంబాబు, విఆర్ఒ పి.తిరుపతి, ఇంజనీరింగ్ సహాయకులు ప్రసన్న, డిజిటల్ సహాయకులు ఎం. అరవింద్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ చందక శ్రీరాములు నాయుడు, ఎస్‌విఆర్‌కె. పట్నాయక్, కార్యాలయ సిబ్బంది పాల్గొని సూచనలు సలహాలు అందించారు.